సాక్షి చిత్తూరు

శుక్రవారం | 30 | మే | 2025



టీచర్ల బదిలీల్లో రగడ

రీఆపోర్సుమెంటు పాయింట్లపై డీఈఓతో ఫ్యాప్టో నేత దురుసు ప్రవర్తనపై జిల్లా అధికారులు అవాక్కయ్యారు. - 8లో



పంటలపై ఏనుగుల విధ్వంసం

చౌడేపల్లి మండలంలోని వరి, మామిడి తదితర పంటలను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. - 8లో



వైభవంగా మహాకుంభాభిషేకం

కాణిపాకంలోని వీరాంజనేయ స్వామి ఆలయ మహా కుంభాభిషేక ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. - 8లో

న్యూస్‌రీల్

పీఎం సూర్యఘర్ లక్ష్యం పెంపు

చిత్తూరు కార్పొరేషన్ : పీఎం సూర్యఘర్ లక్ష్యాన్ని పెంచుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి సీఎండీలతో కలిసి అన్ని జిల్లాల ట్రాన్స్‌కో ఎస్‌ఈలతో నిర్వహించిన వీడియో సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎస్‌ఈ కార్యాలయం నుంచి ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, టెక్నికల్ ఈఈ జగదీష్ పాల్గొన్నారు. రాష్ట్రంలో కొత్తగా లక్ష సర్వీసులు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. వీటిని జూన్ నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీలకు అదనంగా రూ.20 వేలు రాయితీ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. 200 యూనిట్లు విద్యుత్ వాడే ఎస్సీ, ఎస్టీ సర్వీసులకు ఉచితంగా సౌర ఫలకాలు ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా బీసీలకు ఇస్తున్న రాయితీ గురించి అవగాహన కల్పించాలన్నారు. నెలకు 300 యూనిట్లు వాడుతున్న సర్వీసులకు వీటిని వినియోగించుకునే విధంగా ప్రచారం చేయాలన్నారు.

జెడ్పీలో బదిలీల కౌన్సెలింగ్



జెడ్పీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్‌లో బదిలీలకు అర్హులైన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదు సంవత్సరాలు పైగా పని చేస్తున్న సీనియర్ సహాయకులు 11 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సీఈఓ రవికుమార్‌నాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలిన ఉద్యోగులతో చర్చించి బదిలీల ప్రక్రియను తదుపరి ముగించనున్నట్లు సీఈఓ తెలిపారు. పంచాయతీరాజ్‌లో చిత్తూరు ఏఈ ఉమా మహేష్ ఐరాలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆర్‌అండ్‌బీలో జూనియర్ సహాయకులు 7 మంది, టైపిస్టులు 4, రికార్డు సహాయకులు 3, అటెండర్లు 24 మంది ఎస్‌ఈ సత్యనారాయణ, ఈఈ శ్రీనివాసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

జూన్ 4 నుంచి వేరుశనగ విత్తన పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో జూన్ 4వ తేదీ నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన ఏడీఏలతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాకు ఇప్పటి వరకు 15943 క్వింటాళ్ల విత్తనం వచ్చిందన్నారు. మరో 10 వేల క్వింటాళ్ల వరకు కాయలు రావాల్సి ఉందన్నారు. జూన్‌4వ తేదీన చేపట్టబోయే పంపిణీ అన్ని ప్రాంతాల్లో పకడ్బందీగా చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు డ్రోన్లు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో చిత్తూరు, నగరి, పలమనేరు, పుంగనూరు ఏడీఏ ఉమ, సౌభాగ్య లక్ష్మి, గీతాకుమారి, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు మెగా యోగా

చిత్తూరు కలెక్టరేట్ : యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిత్తూరు నగరంలోని పోలీస్ పరేడ్‌లో మెగా యోగా కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో మెగా యోగా క్యాంపెయిన్ శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ సంఘం నాయకులు


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు 2 నెలల పెండింగ్ జీతాలతో పాటు 2019–2021 జీతాలు మంజూరు చేయాలన్నారు. 2019–2021 వరకు సుమారు 36 నెలల జీతాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 350 మంది ఆయాలకు చెల్లించాలన్నారు. కొంత మందికి 18 నెలల జీతాలు ఇచ్చి మరికొంత మందికి 14 నెల జీతాలు పెండింగ్‌లో పెట్టారన్నారు. రాజకీయ కక్షతో తొలగించిన ఆయాలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆయమ్మల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆశ, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న సదస్సులు



వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ సేవలు ప్రజల గడప వద్దకే నడిచొచ్చేవి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మొత్తం ప్రజల గడప వద్దకే వెళ్లి ప్రజల కష్ట నష్టాలను తెలుసుకొని సమస్యలు పరిష్కరించేవారు. ఇక వలంటీర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇంటింటికీ సేవలందించారు. కూటమి పాలనలో పూర్తిగా సీన్ రివర్స్ అయింది. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు గాల్లో కలిసిపోయాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు దూరమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ పథకం, ఏ సేవలకైనా దరఖాస్తు చేసుకోవాలంటే ప్రజలు ఊరు దాటాల్సిన దుస్థితి ఏర్పడింది. క్షేత్రస్థాయిలో ప్రజలు ఊరు దాటి మండల కార్యాలయాలకు వెళ్లి అర్జీలు ఇస్తున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో జిల్లాలోని ప్రజలు కూటమి పాలనపై మండి పడుతున్నారు.

– చిత్తూరు కలెక్టరేట్



సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ కు విచ్చేసిన ప్రజలు

గతంలో ఇంటి వద్ద రేషన్ వాహనాల్లో పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులు, రేషన్ వాహనాలు ఆపివేయడంతో నిరసన తెలుపుతున్న ఎండీయూ ఆపరేటర్లు





ఊరు దాటాల్సిందే!

గ్రౌండ్ రిపోర్ట్

- గడప వద్దకు సేవలు కనుమరుగు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి ముంగిటకే సేవలు
- కూటమి పాలనలో దరి చేరని సంక్షేమ పథకాలు
- సూపర్‌సిక్స్ హామీల అమల్లో ప్రభుత్వం విఫలం
- పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర సేవలను పట్టించుకోని ప్రభుత్వం
- కూటమి పాలనపై మండిపడుతున్న ప్రజలు

అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించింది. అమాయక ప్రజలు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారని నమ్మేశారు. కూటమి ఇచ్చిన కపట హామీలను నమ్మి అధికారాన్ని కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సమయంలో ఏ సంక్షేమ పథకం....ప్రభుత్వ సేవలు.... సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడంతో విస్మయం చెందుతున్నారు. గత ఐదేళ్ల పాటు ఇంటి ముంగిటకే చేరిన సంక్షేమ పాలన, ప్రభుత్వ సేవలను గుర్తు చేసుకుని తప్పు చేశామని ఆవేదన చెందుతున్నారు. నమ్మి కూటమి టీడీపీకి ఓట్లు వేసిన పాపానికి ప్రస్తుతం సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు గడప కాదు కదా ఊరు దాటాల్సిన దుస్థితి ఏర్పడిందని మదన పడుతున్నారు.

నాన్ డీబీటీ పథకంలో లబ్ధి ఇలా....

నాన్ డీబీటీ పథకం	లబ్ధి పొందిన వారు	ఖర్చు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
జగనన్న గోరుముద్ద	137898	140.78
జగనన్న విద్యాకానుక	141030	100.16
ఇళ్ల పట్టాలు	90670	2266.75
రేషన్‌కార్డుల పంపిణీ	78665	-



- గతేడాది డిసెంబర్ 9వ తేదీన వితంతు పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం అందజేశాను. మండల స్థాయిలో వితంతు పింఛన్ కోసం చాలా సార్లు అర్జీ ఇచ్చాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఏ సమస్య ఉన్న గ్రామ సచివాలయంలోనే పరిష్కరించేవారు. ఇప్పుడు కలెక్టర్ కార్యాలయానికి రావాల్సి వస్తోంది. నా భర్త మృతి చెంది చాలా రోజులైంది. అధికారులు స్పందించి వితంతు పింఛన్‌ను ఇప్పించి న్యాయం చేయండి. – వనజ, నర్రాఊరు, యాదమరి మండలం



- గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం అందజేశాను. మాది చిత్తూరు రూరల్ మండలం గాజులపల్లి. నా వయస్సు 74 సంవత్సరాలు. ఇప్పటి వరకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వలేదు. పింఛన్ కోసం చాలా సార్లు మండల అధికారులకు అర్జీలు ఇచ్చాను. ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా న్యాయం జరగడం లేదు. ఇప్పుడైనా కరుణించి వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చా. – నారాయణస్వామినాయుడు, చిత్తూరు రూరల్

నాడు ఇంటి వద్దకే సేవలు

● వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా..

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో కులం, మతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందజేశారు. ప్రజలు సంక్షేమ పథకాలకు ఎవ్వరి దగ్గరికి వెళ్లి సలాం కొట్టాల్సిన అవసరం లేకుండా పారదర్శకంగా పథకాలను పంపిణీ చేశారు. ఒక్క ఏడాది పథకాలు అమలు చేసి చేతులు దులుపుకోకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను అమలు చేశారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాల దరఖాస్తులను పూర్తి చేసి అందజేసేవారు. జిల్లా వ్యాప్తంగా 612 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 9,220 మంది వలంటీర్లు ప్రతి నెలా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించేవారు.

● వైఎస్సార్‌సీపీ పాలనలో అదనంగా పింఛన్లు

వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించి మంజూరు చేసేవారు. 2019 సంవత్సరానికి ముందు టీడీపీ ప్రభుత్వం జిల్లాలో 4,65,180 మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేసేది. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ సర్కారు జిల్లాలో 5,22,869 మందికి పింఛన్లను అందజేసింది. దాదాపు 57 వేల మందికి అదనంగా పింఛన్లను అందజేసింది.

● వలంటీర్లతో సేవలు

ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామునే వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి తలుపు తట్టి పింఛన్‌లు అందజేసేవారు. దూర ప్రాంతాల్లో చికిత్సలు పొందుతున్న లబ్ధిదారులకు సైతం ఇతర రాష్ట్రాలకు వెళ్లి పింఛన్లు ఇచ్చేవారు.

● ఇంటి వద్దే సమస్యల పరిష్కారం

గత ఐదేళ్లల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా గ్రామ సచివాలయం పరిధిలోనే పరిష్కారం అయ్యేవి. వాలంటీర్లే ఇంటి వద్దకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవారు. ప్రతి నెలా అధికారిక యంత్రాంగం గ్రామాల్లో పర్యటించేవారు. ప్రజలతో మమేకమై క్షేత్ర స్థాయి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేవారు.



వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటివద్దకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

● అర్హులయితే సరి..పట్టా ఇవ్వండి

గత వైఎస్సార్‌సీపీ సర్కారు దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఆయా గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు ఉచితంగా ఇంటి పట్టాతో పాటు పక్కా గృహం మంజూరు చేశారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి 1263 లే అవుట్‌లను ఏర్పాటు చేశారు. అందులో 1,48,877 మంది లబ్ధిదారులకు పార్టీలకతీతంగా ఇళ్ల పట్టాలతో పాటు పక్కా గృహాలను మంజూరు చేశారు. దీంతో లక్షల మంది సొంతింటి కలను నెరవేర్చుకున్నారు.

● డాక్టర్లే ఇంటి వదకు వచ్చి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు చేశారు. అదే విధంగా డాక్టర్లే ఇళ్ల వద్దకు వెళ్లి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు మెరుగైన వైద్యం అందించారు. గత సర్కారు పాలనలో 31 సంచార వాహనాలు ఇంటి వద్దకే వెళ్లి 5 లక్షలకు పైగా ప్రజలకు వైద్య సేవలందించారు.

నేడు కార్యాలయాల వద్ద పడిగాపులు

● ప్రస్తుతం టీడీపీ కార్యకర్తలకు ప్రాధాన్యం

కూటమి పాలనలో కులం, మతం, పార్టీ, వర్గం అనే అంశాలను తుంగలో తొక్కారు. అమలు చేస్తున్న అరకొర సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల పేరు వెనుక మూడు అక్షరాలుంటే వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్భాటంగా ప్రారంభించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకున్నారు. అదే విధంగా ఏ పని కావాలన్నా కూటమి ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి ప్రజలు సలాం కొట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి పాలనను చూస్తున్న ప్రజలు విస్తుపోతున్నారు.

● కొత్త పింఛన్ల ఊసే లేదు

కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు ఇవ్వకపోగా కూటమి ప్రభుత్వం రాజకీయ అక్కసుతో అధికారంలోకి రాగానే జిల్లాలో 15 వేలకు పైగా పింఛన్లను తొలగించి పేదల పొట్ట కొట్టింది. ప్రస్తుత సర్కారు పాలనలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి సైతం నూతన పింఛన్ మంజూరు చేయని దుస్థితి. దీంతో ప్రతి సోమవారం వృద్ధులు కాళ్లు అరిగేలా పింఛన్ల మంజూరుకు కలెక్టరేట్‌కు విచ్చేసి వినతులు అందజేసి వేడుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 10 వేలకు పైగా అర్హులు కొత్త పింఛన్ల మంజూరుకు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు.

● అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

కూటమి పాలనలో వలంటీర్లను నిలిపివేయడంతో ఇంటి వద్దకు పింఛన్ల పంపిణీ కనుమరుగయింది. దీంతో ఈ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వృద్ధులు అవస్థలు పడుతూ సచివాలయాల వద్ద పడిగాపులు పడి పింఛన్లు తెచ్చుకుంటున్నారు.

● రేషన్ వాహనాలు కనుమరుగు

ప్రతి నెలా పేద ప్రజల ఇంటి వద్దకు రేషన్ సరుకులను చేరుస్తున్న రేషన్ బండికి కూటమి సర్కారు కనుమరుగు చేసింది. రేషన్ వాహనాలకు రాజకీయ రంగును పులిమి రద్దు చేశారు. దీంతో ఇంటింటికి రేషన్ పథకానికి మంగళం పాడారు. ఆ వాహనాలను నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్న వేల మంది రోడ్డున పడ్డారు.



ప్రస్తుత కూటమి పాలనలో రోడ్లపై పింఛన్‌ల పంపిణీ

● గడప దాటుతున్నా పరిష్కారం కాని సమస్యలు

ప్రస్తుత కూటమి సర్కారు వలంటీర్లను తొలగించడంతో ప్రజలు అర్జీలు చేతపట్టి గడప దాటాల్సిన దుస్థితి ఏర్పడింది. కలెక్టరేట్‌లలో సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలోని ముఖ్యమైన 29 శాఖల్లో 55,789 అర్జీలు నమోదు అయ్యాయి. అందులో 10 శాతం వినతులు కూడా పరిష్కారానికి నోచుకోని దుస్థితి కూటమి పాలనలో నెలకొంది.

● ఒక్క సెంటు భూమి ఇవ్వని ప్రభుత్వం

ప్రస్తుత కూటమి పాలనలో సొంతింటి కోసం ప్రజలు నిత్యం కలెక్టరేట్‌లో దరఖాస్తులు అందజేస్తున్నారు. ఈ కూటమి పాలనలో ఒక్క పేద లబ్ధిదారునికి సెంటు భూమి ఇవ్వని దుస్థితి ఏర్పడింది.

● కానరాని ఇంటింటికీ వైద్యం

ప్రస్తుత కూటమి పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తున్న రోగులకు నాణ్యమైన వైద్యం అందివ్వని దుస్థితి ఏర్పడింది.

రోగులు ఇబ్బందులు పడుతున్నారు



గత ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ పిజీషియన్ విధానం ద్వారా రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు, వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించే వారు. నేడు గ్రామాల్లో ఎక్కడా ఎటువంటి వైద్య శిబిరాలు కానరావడం లేదు. దీంతో రోగులు పడే పాట్లు వర్ణనాతీతం.

– సురేంద్రన్, తుంబ కుప్పం, బంగారుపాళెం మండలం

20 వేల కుటుంబాలు వీధిన పడ్డాయి



ప్రభుత్వం ఎలాంటి సమాచారం లేకుండా వాహనాలు నడిపే 20 వేల మంది కుటుంబాలను వీధిన పడేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు కోల్పోయిన రేషన్ వాహన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.

– సోము, రేషన్ వాహన డ్రైవర్, కత్తెరపల్లి, కార్వేటినగరం మండలం

సిఫార్సులు ఉండాల్సిందే......



సంక్షేమ పథకాలు పొందాలంటే కచ్చితంగా సిఫార్సులు ఉండాల్సిందే. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తోంది. సూపర్ సిక్స్ పథకాల జాడే లేదు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, విద్యా దీవెన, రైతు భరోసా, లాంటి ఎన్నో పథకాలను పేదల గడప వద్దకే చేర్చారు.

– రాఘవ, రైతు, మేలుమయి గ్రామం, గంగవరం మండలం

కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది



గతంలో ఇన్‌కమ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమా అంటూ ఇంటి వద్దే అడిగి మరీ తెచ్చి ఇచ్చారు. ప్రస్తుతం కుల ధ్రువీకరణకు మండల కార్యాలయాల చుట్టూ 15 రోజులు తిరిగి సర్టిఫికెట్ తెచ్చుకున్నాను.

– శ్రీనిషా,ఎంబీఏ విద్యార్థిని, నగరి మండలం

గతంలో పింఛన్ సమస్యలు సచివాలయంలోనే....



మాది గంగాధర నెల్లూరు మండలం ఎల్లమరాజు పల్లె గ్రామం. గత ప్రభుత్వంలో పింఛన్ సమస్యలు సచివాలయంలోనే పరిష్కరించేవారు. ఇప్పుడేమో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు సర్వేలు అంటూ ఊరూరా వెళ్లిపోతున్నారు. దివ్యాంగ పింఛన్ కోసం వినతిపత్రం ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి వచ్చా. – శారద, గంగాధర నెల్లూరు మండలం

జిల్లా సమాచారం

రెవెన్యూ డివిజన్‌లు:	04
మండలాలు:	32
రెవెన్యూ గ్రామాలు:	822
గ్రామ పంచాయతీలు:	697
జనాభా:	18.73 లక్షలు
పురుషులు:	9.40 లక్షలు
మహిళలు:	9.33 లక్షలు
రూరల్ జనాభా:	15.04 లక్షలు
అర్బన్ జనాభా:	3.69 లక్షలు

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తగ్గుతున్న పింఛన్లు

2024 జులై నెలలో	548
ఆగస్టు నెల	634
సెప్టెంబర్ నెల	1,513
అక్టోబర్ నెల	2,819
నవంబర్ నెల	3,670
డిసెంబర్ నెల	3,847
2025 జనవరి నెల	4,598
ఫిబ్రవరి	3,548
మార్చి	3,897
ఏప్రిల్	4,158

డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి కులాల వారీగా

కులం	లబ్ధి పొందిన వారు	లబ్ధిదారులకు అందజేసిన నగదు (రూ. లక్షల్లో)
బీసీ	46,018	126,32,49,639
ఎస్సీ	2,359	6,71,09,756
ఎస్టీ	1,02,9883	12,75,48,265
మైనారిటీ	13,150	23,41,24,416
కాపు	4,339	8,89,37,031
ఇతర కులాలు	15,085	30,10,09,390

మామిడి రైతులను ఆదుకోకుంటే ఆత్మహత్యలే

- జిల్లాలో మామిడి ధరలు పతనం
- రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వానిదే బాధ్యత
- సమావేశంలో రైతుల ఆవేదన
- జూన్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా మామిడి రైతులను ఆదుకోకుంటే.. రైతుల ఆత్మహత్యలను చూస్తారని.. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే బాధ్యత వహించాలని రైతు నాయకులు ప్రకాష్, హరిబాబునాయుడు, శేషాద్రిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు నగంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో మామిడి ధర దిగజారిందన్నారు. మార్కెట్లోకి వెళ్తే మామిడి ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయన్నారు. సీజన్ ప్రారంభమైనా ఫ్యాక్టరీలు తెరుచుకోవడం లేదన్నారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను పట్టించుకోకుండా వదిలేశారని మండిపడ్డారు. ధరలను చూస్తే పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే అవకాశాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మామిడి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. చంద్రబాబు చిత్తూరు జిల్లా వాసిగా ఉండి గతంలో చక్కెర ఫ్యాక్టరీలను మూయించారన్నారు. చెరుకు పంట పోగా.. మామిడి నాటితే.. ఈ పంటను కూడా దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులంతా ఏకమై జూన్ 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నాకు శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలోని రైతులంతా పాల్గొని గిట్టుబాటు ధర కోసం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు నాయకులు మహదేవనాయుడు, రఘునాథనాయుడు, జయచంద్రనాయుడు, చిన్నబ్బరెడ్డి, లోకమందడి తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

విరివిగా మొక్కలు నాటండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఆ శాఖ అధికారులతో గురు వారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లాలో జూన్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి అటవీ, డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలన్నారు. జూన్, జులై నెలల్లో జిల్లాలోని ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాలపై విధులు సక్రమంగా నిర్వహించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఇళ్ల పురోగతిని పరిశీలించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో భరణి, సామాజిక అటవీశాఖ అధికారి జ్ఞానప్రకాష్, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమన్వయంతో జంతు సంక్షేమం



కలెక్టర్‌ను కలిసిన అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : సంస్థల సమన్వయంతో జంతు సంక్షేమానికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏబీసీ కార్యక్రమంపై పలు శాఖల అధికారులు, ఎన్జీవో సంఘం నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల చిత్తూరులో ప్రారంభించిన ఏబీసీ సెంటర్ ఏర్పాటుపై చిత్తూరు అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు చిత్తూరులో ఏబీసీ కేంద్రం ప్రారంభించడం హర్షణీయమన్నారు. జంతువులకు ఆహారం, వైద్య సేవల కొరత వంటి సమస్యలతో ఇబ్బందులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ హరి, కిసాన్ డాక్టర్ ధనంజయ్, చిత్తూరు అనిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు న్యాయవాది మాలతి, మంజునాథరెడ్డి, ఆర్తీ, విజయశిరీష పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి వెల్లడించారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. జిల్లాలో లక్ష మంది సంఘం సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలో వెదురు, మునగ పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మొబైల్ వ్యాన్‌లో రైతుల పండించిన తాజా కూరగాయలు, సంఘం సభ్యులు చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలు, చిరుధాన్యాలను ప్రజల వద్దకే తీసుకెళ్లి విక్రయించే కార్యక్రమాన్ని తవణంపల్లి మండలంలో చేపట్టారన్నారు. సమావేశంలో డీపీఎం రవి, ఏపీఎంలు హేమ, సుబ్బారెడ్డి, మధు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు ఉత్తర్వులను ప్రభుత్వం ఈనెల 29న జారీచేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితిని జూన్ 1 తేదీ నుంచి ఆగస్టు 31 వరకు పెంచుతున్నామన్నారు.

టీచర్ల బదిలీల్లో రగడ

- డీఈఓపై దురుసు ప్రవర్తన
- మహిళా అధికారిణిని కించపరిచేలా వ్యాఖ్యలు
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు



సమస్యలపై చర్చిస్తున్న వివిధ సంఘాల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : బాధ్యతగా వ్యవహరించి సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాల్సిన సంఘం నాయకులు డీఈఓ పై దురుసుగా ప్రవర్తించారు. ప్రస్తుతం టీచర్ల కసరత్తు జరుగుతున్న విషయం విదితమే. ఏ శాఖలోనూ లేని విధంగా విద్యాశాఖలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తు అధికారులకు తలకు మించిన భారంగా మారింది. అయినప్పటికీ ఆ ఒత్తిడిని భరిస్తూనే జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను రోడ్డున పడే విధంగా వ్యవహరించి విమర్శలకు తావిస్తున్నారు.

రీ అపోర్స్‌మెంట్ పాయింట్లపై వివాదం

జిల్లాలోని కొంత మంది టీచర్లకు రీ అపోర్స్‌మెంట్ పాయింట్లు నమోదు చేయడం లేదంటూ ఫ్యాప్టో సంఘం నాయకులు గురువారం డీఈఓ వరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు నిర్వహిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడకు చేరుకున్న వివిధ సంఘాలు, ఫ్యాప్టో నేతలు డీఈఓతో వాదనకు దిగారు. రీ అపోర్స్‌మెంట్ పాయింట్లు ఎందుకు ఇవ్వరంటూ దురుసుగా ప్రవర్తించారు. తిరుపతి జిల్లా ఫ్యాప్టో నాయకులు, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు సురేష్ మహిళా డీఈఓ వరలక్ష్మి పై దురుసుగా ఆమె కేడర్ ను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రవర్తనను చూసిన మిగిలిన సంఘం నాయకులు అడ్డు పడుతున్నప్పటికీ రెచ్చిపోయారు. రీ అపోర్స్‌మెంట్ పాయింట్ల క్లారిఫికేషన్ ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెబుతున్నా ఆ సంఘం నేత కోపంతో ఊగిపోయారు. అసహనానికి లోనైన జిల్లా విద్యాశాఖ అధికారులు దురుసుగా ప్రవర్తించిన తిరుపతి జిల్లా ఏపీటీఎఫ్ సంఘం నేత సురేష్, చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలానికి చెందిన ఎస్జీటీ విజయకుమార్‌పై శాఖాపరమైన చర్యలకు కమిషనర్ కు నివేదిక పంపినట్లు తెలిసింది. ఆ ఇద్దరిపై త్వరలో వేటు పడనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

సమస్యను పరిష్కరించిన అధికారులు

బదిలీల ప్రక్రియలో 2021 బదిలీల్లో వచ్చి 2025 బదిలీల్లో రీ అపోర్స్‌మెంట్ గురవుతున్న టీచర్లకు పాత స్టేషన్ పాయింట్లు వర్తింపజేయాలన్న టీచర్ల డిమాండ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిష్కరించారు. ఈ సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేశారు. ఈ సమస్యను ఎదుర్కొంటున్న స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 29వ తేదీలోపు, ఎస్జీటీలు ఈనెల 30వ తేదీ నుంచి గ్రీవెన్స్‌లో పాత స్టేషన్ పాయింట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు.

దోచేస్తున్నారు!

- ఇష్టారాజ్యంగా తమ్ముళ్ల ఇసుక అక్రమ తవ్వకాలు
- సహకరిస్తున్న రెవెన్యూ, గనులశాఖ అధికారులు
- సరిహద్దు రాష్ట్రాలకు ఇసుక అక్రమ రవాణా
- రూ.లక్షలు లూటీ చేస్తున్న కూటమి నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం ఇసుకాసురులకు వరంగా మారింది. సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక వనరులు లేకపోయినా.. వర్షాలకు వాగులు, కాలువల్లో కొట్టుకొచ్చిన ఇసుక వారి పాలిట కాసులు కురిపిస్తోంది. దీంతో యాదమరి మండల పరిధి తమిళనాడు సరిహద్దు గ్రామమైన పత్రపల్లి చెరువు సమీపంలోని జంబువాని చెరువు వద్ద వాగులోని ఇసుకను యంత్రాలతో తోడేస్తూ ఇసుక డంపులు పెట్టి సరిహద్దు రాష్ట్రానికి అక్రమంగా తరలించి దోచేస్తున్నారు.

తమిళ మాఫియాతో జతకట్టి..

ఇసుక మాఫియాలో ఆరితేరిన తమిళ మాఫియాతో జతకట్టి ఈ అక్రమ తవ్వకాలను తెలుగు తమ్ముళ్లు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి అండదండలతో పట్టపగలే ఇష్టానుసారంగా యంత్రాలతో తోడి ట్రాక్టర్లకు నింపుకుని రోజుకు కొన్ని వందల ట్రిప్పులు తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ తంతుతో రోజుకు రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అసలే తమిళ రాష్ట్రానికి సరిహద్దు గ్రామం ..ఆపై కలిసొచ్చిన ఈ అవకాశాన్ని వదలకుండా ప్రకృతి విధ్వంసం చేస్తున్నారు.

రాత్రిళ్లు అక్రమ రావాణా

కొందరు స్థానిక కూటమి నేతలు కొద్ది రోజులుగా ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు చిన్న చిన్న వాగులు , కాలువల్లోకి కొట్టుకొచ్చిన ఇసుక కోసం జల్లెడ పట్టారు. వారి అదృష్టం కలిసొచ్చి కోమటోని చెరువు నుంచి జంబువాని చెరువుకు ప్రవహిస్తున్న వరద నీటికి పత్రపల్లి చెరువుకు సమీపంలోని శ్మశాన వాటిక వద్ద ఉన్న వాగులోకి కొట్టుకొచ్చిన ఇసుక పుష్కలంగా తారస పడటమే ఆలస్యం.. పక్కా ప్రణాళికతో తమ ఇసుక అక్రమ వ్యాపారాన్ని మొదలెట్టేశారు. తమిళనాడు రాష్ట్రంలో ఇసుక వ్యాపారం చేస్తున్న వారితో చేతులు కలిపి లక్షల రూపాయలు తమ జేబుల్లోకి నింపుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక లోడు రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎవరైనా అడిగితే ఇంటి నిర్మాణం కోసం ఇసుక తవ్వకాలు జరుపుతున్నామని బుకాయిస్తున్నారు. ఒక్కోసారి కొంతమంది అమాయకులపై ఎదురుదాడికి యత్నిస్తున్నారు. పగలంతా జేసీబీ సాయంతో ట్రాక్టర్లలో ఇసుక నింపుకుని సరిహద్దు గ్రామమైన కానికాపురం వద్ద ఒక చేనులో డంప్ చేస్తున్నారు. రాత్రయితే పెద్ద పెద్ద వాహనాలతో నిలువ చేసిన అక్రమ ఇసుకను సరిహద్దు దాటించేస్తున్నారు.

యాదమరి మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేకపోయినా కొద్దో గొప్పో ఉపాధి హామీ పనులు చేపడుతున్న సప్లై చానల్‌లో మాత్రం వర్షాలకు కొట్టుకొస్తున్న ఇసుక పుష్కలంగా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొంతమంది పచ్చ ఇసుక దండు కొన్ని చోట్ల రాత్రికి రాత్రే అధికారుల కన్నుగప్పి ఇసుక తోడేస్తున్నారు.



కాలువలో అక్రమార్కుల ఇసుక తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ఇసుక అక్రమాలను నిలువరించాల్సిన రెవెన్యూ, గనుల శాఖ అధికారులు కూటమి నేతలకు సహకరిస్తున్నారనే విమర్శ వ్యక్తమవుతోంది. పట్టపగలే దర్జాగా యంత్రాలతో కొల్లగొడుతున్నా అటువైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక వారం రోజులుగా ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు సమాచారం తెలియకుండా ఉంటుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గారా ..? లేక అందాల్సిన తాయిలాలు అందడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తునారా..? అని మండల వ్యాప్తంగా పలువురు కోడై కూస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్థానిక కూటమి నేత సహకారం ?

ఇసుక అక్రమ వ్యవహారం మొత్తం స్థానికంగా ఉన్న ఓ కూటమి నేత సహకారంతో నడుస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో సహజ ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంది. అక్కడ ఇసుక వనరులు పుష్కలంగా ఉన్నా...కేవలం ఎంపిక చేసిన రీచ్‌లలో మాత్రమే తవ్వకాలకు అనుమతి ఉంటుంది. ఇష్టారాజ్యంగా ఎక్కడబడితే అక్కడ తవ్వకాలకు పాల్పడితే చట్టపరంగా కఠినమైన శిక్షలు అమలు చేస్తారు. దీంతో తమిళులు మన రాష్ట్ర ఇసుక వనరులపై ఆధార పడుతున్నారు. అక్కడ ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర దాదాపు రూ. 4-7 వేలు వరకు పలుకుతోంది. దీనిని ఆసరాగా తీసుకున్న జిల్లాలోని కొందరు ఇసుక వ్యాపారులు చిత్తూరు - యాదమరి మీదుగా అక్రమంగా తమిళనాడుకు అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు చేరవేస్తున్నారు.

హెచ్‌ఎం బదిలీలు షురూ

- కొత్త స్థానాల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంలు
- సీనియర్ ఎస్‌ఏలకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు



ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : బదిలీల ప్రక్రియలో మొదటి అంకం అయిన గ్రేడ్–2 హెచ్‌ఎంల బదిలీల ఉత్తర్వులు గురువారం జారీ అయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎంలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో బదిలీ అయిన హెచ్‌ఎంలు కొత్త పాఠశాలల్లో చేరారు. ఈ నెలలో కొంత మంది హెచ్‌ఎంలు ఉద్యోగ విరమణ కానున్నారు. ఆ పోస్టుల్లో ఉన్న హెచ్‌ఎంలు ఇంకా రిలీవ్ కాకపోవడంతో జూన్ 1వ తేదీన విధుల్లో చేరనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 169 మంది గ్రేడ్ 2 హెచ్‌ఎంలు నూతన పాఠశాలలకు బదిలీ అయ్యారు.

కొనసాగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఉద్యోగోన్నతులకు అర్హత పొందిన వారికి గురువారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో చేపడుతున్న ఈ ప్రక్రియలో దాదాపు 155 మంది సీనియర్ స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందనున్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



హోమ పూజ చేస్తున్న పండితులు

కాణిపాకం : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ మహా కుంభాషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం జీర్ణోద్ధారణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకంలో భాగంగా మూడో రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అధికారులు, ఉభయదారులు, దాతలు ఊరేగింపుగా కలశాలను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, దాత అనిల్ కుమార్, దేవస్థానం మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పలమనేరు /గంగవరం : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గంగవరం మండలంలోని గండ్రాజుపల్లి వద్ద చెన్నై- బెంగళూరు హైవేలో గురువారం చోటుచేసుకుంది. పట్టణంలోని గంటావూరుకు చెందిన సయ్యద్ మహ్మద్(57) స్కూటర్‌పై స్వగ్రామానికి వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు అతడి బైక్‌ను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గంగవరం పోలీసులు మృతదేహాన్ని పలమనేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ..



లిఖిత (ఫైల్)

పలమనేరు /గంగవరం : బెంగళూరులో గురువారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గంగవరం మండలంలోని సామరాజుపల్లికి చెందిన శ్రీనివాసులరెడ్డి కుమార్తె లిఖిత(45) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తోంది. సిటీలోని హుగ్గీ గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఆమెను ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరి మృతి



మృతి చెందిన అమరేంద్రబాబు

బంగారుపాళెం : మండలంలోని పాలమాకులపల్లె వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. చిత్తూరు పట్టణం లక్ష్మీనగర్‌కు చెందిన అమరేంద్రబాబు(48), బంగారుపాళెం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన రమేష్(44) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరూ ద్విచక్రవాహనంపై పనులకు వెళ్లి బలిజపల్లె నుంచి బంగారుపాళెం వైపు వస్తూ రోడ్డు క్రాస్ చేస్తుండగా చిత్తూరు నుంచి పలమనేరు వెళుతున్న కారు.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంటలపై ఏనుగుల విధ్వంసం

చౌడేపల్లి : మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ తొప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె, చుక్కావారిపల్లె పరిసర ప్రాంతాల్లోని పంటలను గురువారం తెల్లవారు జామున ఏనుగులు విధ్వంసం సృష్టించాయి. వరి ,మామిడి, బెండ, బీర, టమాట పంటలను తొక్కి నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బోర్ల పైపులు ధ్వంసం చేసి విరిచేశాయి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.